డెంగ్యూతో ముగ్గురి మృతి

సందేశ్ (ఫైల్)

శ్రీలత (ఫైల్)

మల్లాపూర్/ ముత్తారం/కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 1: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం డెంగ్యూతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన మైలారపు సందేశ్(25) ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి, నెల రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. డెంగ్యూ పాజిటివ్ రాగా, నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీలత(40) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. శుక్రవారం హన్మకొండలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా, డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారించారు. శనివారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. కామారెడ్డి మండలం టేక్రియాల్‌కు చెందిన చౌకి సుజిత్ (16) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. డెంగ్యూ నిర్ధారణ కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు.

సన్మానగ్రహీతలతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్ మురళి, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ తదితరులు

దేశంలో నిజాయితీపరుల సంఖ్య పెరగాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ
- వైపీసీ ఆధ్వర్యంలో నిజాయితీ అధికారులకు సత్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : దేశంలో నిజాయితీ అధికారులు, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇల్లు, స్కూల్‌లోనే దానికి బీజం పడాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని బేగంపేట హరితప్లాజాలో ఆదివారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్(వైపీసీ) సంస్థ ఆధ్వర్యంలో 16 మంది నిజాయితీ అధికారులను సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాజకీయాల్లో సంస్కరణలతో అవినీతిని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనా విధానం మారాలని, ప్రజా ఉద్యమాలను చేపట్టే వ్యక్తులను ప్రోత్సహించాలని సూచించారు. మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ.. సమాజంలో అవినీతి జరుగుతుందని ప్రతి ఒక్కరూ అంటుంటారు.. కానీ, కండ్ల ముందు జరుగుతున్న అవినీతిని ప్రశ్నించడానికి మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వశాఖల్లో నిజాయితీపరులు ఎక్కడున్నారో వెతకడం కష్టమని, చాలామంది తప్పులు చేస్తూనే నిజాయితీగా ఉన్నట్టు నటిస్తారని చెప్పారు. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ మాట్లాడుతూ.. మంచి సమాజం ఏర్పడాలంటే మంచి వ్యక్తులు కావాలని, ఆ వ్యక్తులకు గుర్తింపు ఉండాలని, ఆ గుర్తింపు వైపీసీ ఇస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. వైపీసీ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ.. తెలుగు రాష్ర్టాల్లో అవినీతిరహితంగా, నిజాయితీగా పనిచేస్తున్న అధికారులను 14ఏండ్లుగా సన్మానిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైపీసీ అవార్డు కమిటీ చైర్మన్ దన్నపనేని అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బక్కిని నర్సింహులు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్నిగ్ధ, లక్ష్మీకళ, మీడియా కార్యదర్శి జయరాం, కోమటి రమేశ్‌బాబు, కొన్నె దేవేందర్, జీ హరిప్రకాశ్, వరికుప్పల గంగాధర్, బత్తిని రాజేశ్, చింతల రమేశ్, ఎం విక్రమ్, సీహెచ్ ప్రేమ్, కొక్కుల ప్రశాంత్, సూర రాజేందర్, నాగేంద్ర, నియామత్ బాషా, ఇలియాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

- గురుకుల పాఠశాలలను పట్టించుకోరా?
- మాజీ మంత్రులు హరీశ్, జగదీశ్‌రెడ్డి మండిపాటు
- కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకులం పరిశీలన
- 13 మందిని ఎలుకలు కొరికిన ఘటనపై ఆరా
- సమస్యలు తెలుసుకొని విద్యార్థులకు పరామర్శ


దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కమలాకర్, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి

దేవరకొండరూరల్, సెప్టెంబర్ 1 : రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైనా పట్టించుకోరా? అని మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలతో ఎన్నాళ్లు చెలగాటమాడుతారని నిలదీశారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం 13 మంది విద్యార్థులను ఎలుకల కరిచిన విషయం తెలిసిందే. దీంతో మాజీ మంత్రి గంగుల కమలాకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం వారు గురుకుల పాఠశాలను సందర్శించి ఎలుకలు కొరికిన విద్యార్థులను పరామర్శించారు. గురుకులంలో సమస్యలను తెలుసుకున్నారు. ఫ్యాన్లు పనిచేయక పోవడం వల్ల కిటికీలు తెరిచి పడుకుంటే వాటిలోంచి ఎలుకలు వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. కిటికీలకు దోమ తెరలు లేక నిద్రకూడా సరిగా పోతలేమని వివరించారు. రగ్గులు, ట్రాక్ సూట్లు, కాస్మోటిక్ చార్జీలను ఇంతవరకు ఇవ్వలేదని వాపోయారు. భోజనం ఎలా ఉన్నదని 9వ తరగతి విద్యార్థిని అడుగగా గతంలో రైస్ బాగుండేదని, ఇప్పుడు బాగోలేదని తెలిపాడు. బాత్‌రూమ్ డోర్లు సరిగా లేవని, విద్యుత్తు పోయినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి హెల్త్‌సూపర్‌వైజర్‌ను అడుగగా, మందులు మాత్రమే ఇస్తామని, ఇంజెక్షన్స్ తమ వద్ద ఉండవని చెప్పారు. పాము, తేలు కాటుకు సంబంధించి యాంటీవీనమ్ ఇంజెక్షన్స్ కూడా తమ వద్ద లేవని, దగ్గర్లోని తూర్పుపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు ఉన్నందున పాములు, తేళ్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని, యాంటీవీనమ్ ఇంజెక్షన్స్‌ను అందుబాటులో ఉంచడంపైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని మాజీ మంత్రులు మండిపడ్డారు. విద్యార్థులను పరామర్శించినవారిలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్ కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర : గంగుల కమలాకర్

కేసీఆర్ హయాంలోనే గురుకులాలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించారని, 9 నెలల పాలనలో గురుకులాల పరిస్థితిపై ప్రభుత్వం ఒక్క సమీక్ష కూడా పెట్టలేదని గంగుల కమలాకర్ తెలిపారు. విద్యార్థులు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో మునిగిపోయిందని విమర్శించారు.

పట్టించుకునే నాథుడే లేడు : ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

తొమ్మిది నెలల నుంచి గురుకులాలను పట్టించునే నాథుడే లేడని, కేసీఆర్ హయాంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దిన గురుకులాలు కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గురుకులాలను పట్టించుకోకుండా, ఇంత వరకు ఆ శాఖకు మంత్రిని నియమించకుండా సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, ఆయనకు హైదరాబాద్, ఢిల్లీ చక్కర్లు కొట్టేందుకే సమయం సరిపోతున్నదని మండిపడ్డారు. బోధనోపాధ్యాయులకు సమయానికి జీతాలు అందడం లేదని, వంట చేసేవారికి జీతాలు లేవని, కరెంట్ బిల్లులు, అద్దె బిల్లులు రాక గురుకులాల పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు.

లడఖ్‌లో వాడగూడెం వాసి పర్వతారోహణ

మంగపేట, సెప్టెంబర్1: ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడేనికి చెందిన వాసం వివేక్ జమ్మూకశ్మీర్ లడఖ్‌లోని 20వేల అడుగులకుపైగా ఎత్తులో ఉన్న రెండు పర్వతాలను అధిరోహించి జాతీయ స్థాయిలో పేరు సాధించాడు. వివేక్ ఆగస్టు 24న లడఖ్‌లో 20,600 అడుగుల ఎత్తులో ఉన్న కంగ్‌యాత్సే-2 శిఖరాన్ని అధిరోహించాడు. తర్వాత మూడో రోజునే ఆగస్టు 27న (21 వేల అడుగుల ఎత్తులోని కంగ్‌యాత్సే-1 శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించాడు. ఇవేగాక ఇంకా చాలా పర్వతాలను వివేక్ అధిరోహించాడు.

కంగ్ యాత్సే-1 పర్వతంపై వివేక్

టానిక్ ఎలైట్ మద్యం షాపు సీజ్

రూ.1.70 కోట్ల మద్యం స్వాధీనం

హైదరాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ) : జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-36లోని టానిక్ ఎలైట్ మద్యం షాపును ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని పేర్కొంటూ నిర్వాహకులు ఇచ్చిన రెన్యూవల్ దరఖాస్తును తిరస్కరించారు. ఈ మేరకు శనివారం రాత్రి రిజెక్షన్ ఆర్డర్ పంపి.. ఆదివారం ఉదయం దుకాణంలోని రూ.1.70 కోట్ల విలువైన వివిధ బ్రాండ్లకు చెందిన 10,291 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అనుమతితో 2016 నుంచి ఈ షాపు కొనసాగుతుండగా.. ఆగస్టు 31న గడువు ముగిసింది. దీంతో సెప్టెంబర్ 1 నుంచి షాపు నడపడం చట్టరీత్యా నేరమని మీడియా సమక్షంలో మద్యం సీసాల లెక్కింపు అనంతరం దుకాణానికి సీల్ వేశారు. కార్యక్రమాన్ని హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సీఐ వాసుదేవరావు పర్యవేక్షించారు.

యూ బిట్ కాయిన్ పేరిట మోసం

ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై సహా ఐదుగురి అరెస్టు

ఆర్మూర్‌టౌన్/నిర్మల్(నమస్తే తెలంగాణ), సెప్టెంబర్ 1: క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ పేరిట అధిక వడ్డీ ఆశ చూపి అమాయకులతో ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టిస్తూ మోసాలకు పాల్పడుతున్న బిట్‌కాయిన్ ముఠా గుట్టును నిర్మల్ జిల్లా పోలీసులు రట్టు చేశారు. నిందితుల్లో ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ కూడా ఉన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల వివరాలు వెల్లడించారు. కడెం మండలంలోని నవాబ్‌పేట్‌కు చెందిన సల్ల రాజ్‌కుమార్, సాయికిరణ్‌తోపాటు నిర్మల్‌కు చెందిన కండెల నరేశ్, గంగాధర్, మహేశ్ బిట్‌కాయిన్ పేరిట ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. రూ. లక్ష పెట్టుబడి పెడితే ప్రతి నెలా రూ.14 వేలు వస్తాయని చాలా మంది అమాయకులను దందాలోకి దించినట్టు గుర్తించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్టు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. కొంత మంది అప్పు లు చేసి మరీ ఇందులో పెట్టుబడి పెట్టినట్టు తమ దృష్టికి రావడంతో విచారణ జరిపామని, ఎక్సైజ్ ఎస్సై గంగాధర్‌తో సహా ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు.

అధికారుల్లో హైడ్రా చిచ్చు

- మా ఉద్యోగులపై కేసులెట్లా పెడ్తరు?
- కబ్జా చేసినోళ్లను వదిలి మావాళ్లపై కేసులా
- హైడ్రాపై రాష్ట్రస్థాయి అధికారి తీవ్రధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అధికారుల్లో ఇప్పుడు హైడ్రా చిచ్చు మొదలైంది. రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా' పేరుతో ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయించటం, చెరువులు, నాలాలను కబ్జా చెర నుంచి విడిపించే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, కొందరినే లక్ష్యంగా చేసుకొని హైడ్రా పనిచేస్తున్నదన్న ఆరోపణలు వస్తుండగా, ఆరుగురు మున్సిపల్, రెవెన్యూ అధికారులపై కేసు పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమ శాఖల అధికారులపై కేసు పెట్టడం ఉన్నతాధికారుల్లో ఒకింత అసహనం వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో ఈ తరహా కేసు పెట్టడం ఇదే తొలిసారి కాగా, ఎప్పుడో ఇచ్చిన అనుమతులపై ఇప్పుడు కేసులు నమోదు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక నిర్మాణాల్లో అనేక ఉల్లంఘనలు ఉన్నాయని, వారందరిపైనా ఇవే కేసులు పెడతారా? అన్న ప్రశ్న తలెత్తుతున్నది. అధికారులపై కేసు.. ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య వివాదంగా మారినట్టు సమాచారం. తమకు తెలియకుండానే కేసులు నమోదు చేయటంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి ఒకరు పోలీసులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. హైడ్రా కమిషనర్, పోలీస్ ఉన్నతాధికారులను పిలిచి ఇదేం పద్ధతి అని నిలదీసినట్టు సమాచారం. 'మీరు ఇట్లా కేసులు పెట్టేముందు మాకెందుకు చెప్పలేదు. ఇట్లా కేసులు పెట్టి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి మెసేజ్ పంపిస్తున్నట్టు?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఒక్క వీరితోనే ఆపేస్తారా? ఒక్క వీళ్లు మాత్రమే తప్పు చేశారంటారా? అని పలువురు ఐఏఎస్‌లు హైడ్రా అధికారులను నిలదీసినట్టు సమాచారం. ఐఏఎస్‌లను కాదని, ఐపీఎస్‌ను ప్రభుత్వం కమిషనర్‌గా పెట్టడంపైనా పలువురు ఐఏఎస్‌లు తప్పుపడుతున్నట్టు తెలిసింది. అడ్మినిస్ట్రేషన్‌లో ఇంత పెద్ద బాధ్యత ఒక ఐపీఎస్ చేతిలో పెట్టడం ఏమిటి? అని ఇటీవల సచివాలయంలో అత్యంత కీలకమైన ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

కట్టిన బిల్డర్లపై చర్యలుండవా?

బిల్డర్లపై హైడ్రా ఎందుకు కేసులు పెట్టడం లేదన్న చర్చ జరుగుతున్నది. చెరువుల వద్ద ఇండ్లు కట్టిన, అపార్ట్‌మెంట్లు, వెంచర్లు వేసి, భవనాలు కట్టినవారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి.. అధికారులను లక్ష్యంగా చేసుకోవడమేమిటన్న చర్చ ఉద్యోగవర్గాల్లో జరుగుతున్నది. ఇదే విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో రాష్ట్ర ఉన్నతాధికారి ఒకరు స్వయంగా అన్నట్టు తెలిసింది. అధికారులపై కేసులు పెట్టేముందు వారి శాఖలతో సంబంధం ఉన్న అధికారులకు సమాచారం ఇవ్వడం కనీస మర్యాద, పద్ధతి అని స్పష్టం చేసినట్టు సమాచారం. ఉద్యోగులపై కేసులు పెట్టడం ప్రభుత్వ పాలసీ కాదని, తాను రాష్ట్రంలో ఉన్నతాధికారిగానే ఉన్నానని పేర్కొన్నట్టు తెలిసింది.

కొత్త సీఈఐజీగా ఏపీ అధికారి!

- ఆంధ్రా వ్యక్తికే వత్తాసు పలికిన రిటైర్డ్ అధికారి
- కీలక పోస్టు ఎగరేసుకుపోయే ప్రయత్నాలు
- పోస్టులు తెలంగాణవి.. పెత్తనం ఏపీవాళ్లదా?
- రెడ్‌కో వీసీ అండ్ ఎండీ అంశంలో ఉద్యోగుల ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో అత్యంత కీలకమైన తెలంగాణ విద్యుత్తు ప్రధాన తనిఖీ అధికారి (సీఈఐజీ) పోస్టు ఎవరికి దక్కుతుందన్న అంశమిప్పుడు హాట్‌టాపిగా మారింది. ఈ పోస్టును ఓ ఆంధ్రా అధికారి ఎగరేసుకుపోయేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ అధికారిని కాదని, తనకే ఆ పోస్టు కట్టబెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన సీఈఐజీ కూడా ఏపీ అధికారికే మద్దతుగా నిలవటం, ఆయన్నే కొత్త సీఈఐజీగా నియమించాలని ప్రభుత్వానికి లేఖ రాయటం చర్చనీయాంశంగా మారింది. ఇదివరకు పనిచేసిన సీఈఐజీ ఆగస్టు 31న పదవీ విరమణ పొందారు. దీంతో కొత్త సీఈఐజీని నియమించాల్సి ఉన్నది. తెలంగాణ ఆవిర్భావం నుంచి సీఈఐజీ పోస్టులో ఏపీ అధికారులే కొనసాగుతూ వచ్చారు. ఈసారి తెలంగాణ అధికారులకే అవకాశం కల్పిస్తారని అంతా భావించారు. కానీ, మళ్లీ ఆంధ్రా అధికారి ఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేయటం తెలంగాణ అధికారులను కలవరపెడుతున్నది. రిటైర్డ్ అధికారి ఏపీ అధికారిని నియమించాలని సిఫారసు చేయడం గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇదే మొదటిసారి. దీనిపై తెలంగాణ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. తెలంగాణవారికే సీఈఐజీ పోస్టును కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కొక్కటిగా ఎసరు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విద్యుత్తు సంస్థల్లో ఏపీ అధికారులకు పెద్దపీట వేస్తున్నారు. ఇన్నేండ్లు సైలెంట్‌గా ఉన్న ఆంధ్రా అధికారులు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఒక్కోదానికి ఎసరుపెడుతున్నారు. ఆంధ్రా మత్తులో జోగుతున్న తెలంగాణ సర్కారు పెద్దలు కీలక స్థానాలను వారికే అప్పగిస్తున్నారు. తెలంగాణ బిడ్డల నోట్లో మట్టికొడుతున్నారు. దీంతో పోస్టులు తెలంగాణవి.. పెత్తనం ఆంధ్రా అధికారులది అన్నట్టు తయారైంది పరిస్థితి. ఇప్పటికే టీజీఎస్పీడీసీఎల్‌లో ముగ్గురు ఆంధ్రా అధికారులను ఇన్‌చార్జి డైరెక్టర్లుగా కొనసాగిస్తున్నారు. ఇటీవలే టీజీ రెడ్కో వైస్ చైర్మన్ అండ్ ఎండీగా సీమాంధ్ర మూలాలున్న డీఈని నియమించారు. దీనిపై ఇప్పటికే తెలంగాణ ఉద్యోగులు మండిపడుతున్నారు. సోషల్‌మీడియాలో పెద్దఎత్తున తమ నిరసన వ్యక్తంచేస్తున్నారు. 'తెలంగాణ ఇచ్చిన పార్టీ అని ఓటేస్తే తెలంగాణ వాదాన్ని పూర్తిగా మరుగునపడేసింద్రు. మా ఉద్యోగాలు మాకే అన్న నినాదాన్నే గాలి కొదిలేసింద్రు. ఆంధ్రా వాళ్లు వెళ్లిపోయింద్రని అనుకుంటే చింత చచ్చినా.. పులుపుచావలే అనుకున్నట్టే' అని ఓ విద్యుత్తు ఉద్యోగి ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రావాళ్లు లేకుండా పాలన చేసుకోలేరంటూ బెత్తంపట్టుకొని కిరణ్ కుమార్‌రెడ్డి అన్న మాటలను నేటి కాంగ్రెస్ పాలన నిజం చేస్తున్నదని మరో అధికారి విస్మయం వ్యక్తంచేశారు.

సీపీఎస్ మాకొద్దు.. పాత పెన్షనే ముద్దు

గన్‌పార్క్ వద్ద ధర్నాలో ఎంప్లాయిస్ జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్), యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) ఏదీ వద్దు.. పాత పెన్షన్‌నే అమలుచేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద ధర్నా నిర్వహించారు. కుండపోతగా పడుతున్న వర్షాన్ని లెక్క చేయకుండా తరలివచ్చిన ఉద్యోగ సంఘాల నేతలు సీపీఎస్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలను సర్కారు పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధర్నాలో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, ఎస్ఎం హుస్సేని, ఎనుగుల సత్యనారాయణ, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, గంగాపురం స్థితప్రజ్ఞ, కల్వల శ్రీకాంత్, చావా రవి, వంగ రవీందర్‌రెడ్డి, జీ సదానందంగౌడ్, జ్ఞానేశ్వర్, డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, కటకం రమేశ్, రాజభానుచంద్రప్రకాశ్, కనకచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలుచేయాలని గన్‌పార్క్ వద్ద ధర్నా చేస్తున్న తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ

'సీపీఎస్ రద్దుకు కృషిచేయండి'

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల పెన్షన్ హక్కులను హరిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దుచేసేందుకు కృషిచేయాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరింది. పాత పింఛన్ అమలుచేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తిచేసింది. సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆదివారం హైదరాబాద్‌లో స్పీకర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్‌తో 20 ఏండ్లుగా సామాజిక భద్రత కరవై, ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయని వాపోయారు. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్టు స్థితప్రజ్ఞ తెలిపారు. కోశాధికారి నరేశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, అశోక్‌రెడ్డి, సుశీల్ తదితరులు స్పీకర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

'ఎస్‌వోఐ' గెజిటెడ్ ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌గౌడ్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 1: సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖలోని సర్వే ఆఫ్ ఇండియా(ఎస్‌వోఐ) గెజిటెడ్ అధికారుల సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా గోటూరి రమేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. పొరుగు దేశాల మధ్య ఉండే అంతర్జాతీయ సరిహద్దుల నిర్వహణ, ఏదైనా వివాదం ఉత్పన్నమైనప్పుడు పరిష్కరించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుంది. రమేశ్‌గౌడ్ ప్రస్తుతం బీఎంఎస్ ఉపాధ్యక్షుడిగా, స్వావలంబి భారత్ అభియాన్‌కు రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న పొచ్చెర

భారీ వర్షాలకు ఆదివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. పర్యాటకులు సమీపంలోకి రాకుండా అధికారులు అప్రమత్తమయ్యారు.

– మంచిర్యాల, నమస్తేతెలంగాణ ప్రతినిధి

సీఎం రేవంత్‌రెడ్డితో శ్రీనివాస్‌రెడ్డి

సీఎంను కలిసిన మీడియా అకాడమీ చైర్మన్

జర్నలిస్టుల సంక్షేమంపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమంపై చర్చించినట్టు తెలిసింది. 8న రవీంద్రభారతిలో నిర్వహించనున్న జేఎన్‌జేహెచ్‌ఎస్ స్థలాల అప్పగింత కార్యక్రమంపై, రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య పథకం ఇతర సంక్షేమాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగినట్టు సమాచారం.

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్

హైదరాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ): పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఆదివారం నారాయణగూడలోని పీఆర్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మణ్ ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ఉద్యోగ విరమణతో ఈ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. అక్టోబర్ 7న రాష్ట్ర శాఖకు ఎన్నికలు జరగనున్నాయి. అప్పటివరకు ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ కొనసాగుతారని రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బీ మోహన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ అధ్యక్షుడు పీ వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక ప్రధాన సంపాదకుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో మన్నుపోసిన సీఎం

పేదల ఇండ్లను కూలిస్తే ఖబర్దార్: ఎంపీ ఈటల

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ఆడుతున్నది డ్రామా తప్ప సమాజహితం కోసం కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. బందిపోట్లలాగా ఇండ్లను కూల్చుతూ పేదల బతుకుల్లో ముఖ్యమంత్రి మన్నుపోశాడని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్మశానవాటికకు, గుడికి, క మ్యూనిటీ హాల్‌కు కూడా నోటీసు ఇచ్చారంటే రేవంత్‌రెడ్డికి ఎంత తెలివి ఉన్నదో తెలుస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ నిర్మాణాలకు కారకులకు శిక్ష వేయాలని, వారి నుంచే రికవరీ చేయాలని, చట్టబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. పేదల పక్షాన మాట్లాడే వారి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తమ సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. పేదల ఇండ్లు కూలిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ప్రాణం తీసిన టీవీ చానల్ గొడవ

ఛాతిలో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి

నార్నూర్, సెప్టెంబర్ 1: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొలాంగూడకు చెందిన సేదం లక్ష్మణ్(35) ఆదివారం మధ్యాహ్నం పక్కనే ఉంటున్న కొడప జైతు ఇంట్లో టీవీ చూడడానికి వెళ్లాడు. అప్పటికే జైతు, రాములు టీవీ చూస్తున్నారు. లక్ష్మణ్ టీవీ చానల్ మార్చాలని రాముతో గొడవపడ్డాడు. తాగిన మత్తులో ఉన్న మాడావి రాము చంపేస్తానని లక్ష్మణ్ ఛాతిపై పిడికిలితో బలంగా కొట్టి, గొంతు నొక్కాడు. లక్ష్మణ్ స్పృహ కోల్పోయాడు. గమనించిన రాము అక్కడి నుంచి పారిపోయాడు. లక్ష్మణ్‌ను దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. లక్ష్మణ్ భార్య మంతుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రహీం పాషా తెలిపారు.

ఐసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఐసెట్ వెబ్ కౌన్సెలింగ్ ఆదివారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు 3,057 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 8 వరకు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 3 నుంచి 9వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపడతారు.